సాక్షి
చిత్తూరు
ఆదివారం । 26 । నవంబర్ । 2023



క్రీడాకారులకు అండగా ప్రభుత్వం
క్రీడాకారులకు ప్రభుతం అండగా నిలుస్తోం దని తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి తెలిపారు. - 8లో



'వికసిత్ భారత్'కు శ్రీకారం
కేంద్రప్రభుత్వ పథకాలను ప్రచారం చేసేం దుకు వికసిత్ భారత్ యాత్ర నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. - 8లో



వరసిద్ధుని సేవలో ప్రముఖులు
కాణిపాకం వరసిద్ధి వినాయస్వామిని శనివారం పలువురు ప్రముఖులు సేవిం చుకున్నారు. - 8లో

న్యూస్‌రీల్

ద్రవిడ వర్సిటీ ఇన్‌చార్జి వీసీగా భారతి



ఇన్‌చార్జి వీసీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న రిజిస్ట్రార్

కుప్పం : ద్రవిడ యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీగా డి.భారతి శనివారం బాధ్యతలు స్వీకరించారు. తిరుపతి శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం వీసీగా విధులు నిర్వహిస్తున్న ఆమెకు ద్రవిడ వర్సిటీ బాధ్యతలను అదనంగా అప్పగించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి వీసీని రిజిస్ట్రార్ ఆచార్య వేణుగోపాలరెడ్డి, సిబ్బంది ఘనంగా సత్కరించారు. వీసీ భారతి మాట్లాడుతూ ద్రవిడ వర్సిటీ బాధ్యతలు అప్పగించిన గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు కొటాల విద్యార్థులు



విద్యార్థులతో పీఈటీ సురేష్

యాదమరి: గుంటూరు జిల్లా నర్సరావుపేటలో ఆదివారం నుంచి నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ ఖోఖో పోటీలకు కొటాల ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికై నట్లు ప్రధానోపాధ్యాయుడు యూసఫ్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 28వ తేదీ వరకు కొనసాగనున్న పోటీల్లో చీఫ్ కోచ్ బాలాజీ ఆధ్వర్యంలో విద్యార్థులు యశ్వంత్, జస్వంత్, ఢిల్లీప్రియ, మైథిలి, పూజ, మధు, ప్రియ, గాయత్రి పాల్గొంటున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

కొనసాగుతున్న 'గజ'దాడులు



ఏనుగుల దాడిలో దెబ్బతిన్న టమాట పంట

వి.కోట: మండలంలో నాలుగు రోజులుగా ఏనుగులు బీభత్సం సృష్టిస్తున్నాయి. అటవీ సరిహద్దులోని గ్రామాల్లో పంటను ధ్వంసం చేస్తున్నాయి. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి దానమయ్యగారిపల్లె, పచ్చారుమాకులపల్లె రైతులు సాగు చేస్తున్న టమాట పంటలను నాశనం చేశాయి. కొమ్మరమడుగు గ్రామానికి చెందిన రైతుల మల్చింగ్ పేపర్లు, నీటి సరఫరా పైపులు, పశుగ్రాసం, కాకర, మొక్కజొన్న పంటలను నష్టపరిచాయి. ఏనుగుల దాడిలో సుమారు రూ.5లక్షల వరకు పంట నష్టం వాటిల్లినట్లు బాధిత రైతులు వెల్లడిస్తున్నారు. అటవీశాఖ అధికారులు ఏనుగుల కట్టడిలో వైఫల్యం చెందారని మండిపడుతున్నారు.

నిమ్మలో రాణిస్తూ..!

నిమ్మ సాగును పల్లెపడుచులు కొత్తపుంతలు తొక్కిస్తున్నారు. దుక్కిదున్నడం నుంచి పురుగు మందులు పిచికారీ వరకు రాటుదేలుతున్నారు. అ, ఆలు రాకపోయినా అధునాతన పద్ధతులను అవలంభిస్తున్నారు. అధిక దిగుబడులు గడిస్తూ అబ్బురపరుస్తున్నారు. రెక్కలు ముక్కలు చేసుకుంటూ ఇంటి యజమానులకు చేదోడువాదోడుగా నిలుస్తున్నారు. 'కాయ'కష్టానికి తోడు ఈ నాలుగున్నరేళ్లలో నిమ్మకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉండడంతో అధిక ఆదాయం గడిస్తున్నారు. పిల్లలను ఉన్నత చదువులు చదివిస్తూ పదుగురికి ఆదర్శంగా నిలుస్తున్నారు.. వెంకటగిరి నియోజకవర్గంలోని మహిళలు.. నిమ్మసాగులో 'రాణి'స్తూ.. కుటుంబాలను ఒంటిచేత్తో నడిపిస్తున్న తీరుపై సాక్షి ప్రత్యేక కథనం..

నిమ్మ సేద్యంలో ప్రతిభ చూపుతున్న మహిళలు
- పురుషులతో సమానంగా వ్యవసాయ పనులు
- నీళ్లు పెట్టడం నుంచి మందుల పిచికారీ వరకు అన్నీ తామై..
- కుటుంబాలను చక్కబెడుతూ.. భర్తలకు చేయూతనిస్తున్న పల్లెపడుచులు
- వెంకటగిరి నియోజకవర్గంలో 'నిమ్మ'ళంగా సాగుతున్న కుటుంబాలు

సమాచారం

నియోజకవర్గం	: వెంకటగిరి
మండలాలు	: ఆరు
నిమ్మతోటలు	: 10 వేల హెక్టార్లలో
పనిచేస్తున్న కూలీలు	: 25 వేల మంది
ఇందులో మహిళలు :	12,500 మందిపైనే

సాక్షి, తిరుపతి డెస్క్: వెంకటగిరి నియోజకవర్గంలోని సైదాపురం, రాపూరు, కలువాయి, బాలాయపల్లి, డక్కిలి, వెంకటగిరి రూరల్ మండలాల్లో అత్యధికంగా నిమ్మ సాగుచేస్తుంటారు. నియోజకవర్గంలోని ఈ ఆరు మండలాల్లో సుమారు 10వేల హెక్టార్లలో నిమ్మతోటలు సాగుచేస్తున్నారు. కొద్ది మంది మినహా అందరూ నిమ్మతోటలను సాగు చేస్తున్నారు. నిమ్మ తోటల్లో పనులు చేసేందుకు ప్రత్యక్షంగా 15,000 మంది, పరోక్షంగా 10 వేల మందికి ఉపాధి దొరుకుతోంది. ఇక్కడ పనిచేసే సగం మంది కూలీలు మహిళలే కావడం విశేషం.



▶▶ ఈమె పేరు దాసరిరాజు స్వాతి. సైదాపురం మండలం, లింగసముద్రం గ్రామం. ఈమె నిమ్మతోటలో రోజువారి కూలీ. గ్రామ సమీపంలో ఉన్న నిమ్మ తోటలో వ్యవసాయ పనులు చేస్తుంటుంది. ఉదయం సద్ది కూడు మూటగట్టుకుని వెళ్లి అక్కడే ఉంటూ నిమ్మతోటకు నీరు పెట్టడం.. పురుగు మందులు పిచికారీ చేయడం లాంటివి చేస్తుంటుంది. ఆమె మగావాళ్లకన్నా దీటుగానే వ్యవసాయ పనులు చేస్తోంది.



▶▶ ఈ ఫొటోలోని మహిళ పేరు చెంచు కృష్ణమ్మ. భర్తతో కలిసి స్థానికంగా ఉన్న ఓ ఆసామి వద్ద పనిచేస్తోంది. భార్యాభర్తలిద్దరూ నిమ్మ తోటల్లోనే ఉంటున్నారు. పురుగు మందులు పిచికారీ చేయాలంటే చెంచుకృష్ణమ్మ ముందుంటుంది. ఆసామికి ఉన్న 1000 నిమ్మ చెట్లకు ఆమె ఒక్కటే పురుగుమందు పిచికారీ చేస్తుంటుంది. మగవాళ్లతో సమానంగా నిమ్మతోటల్లో సేద్యం చేస్తుంటుంది. ఆమెకు రోజువారీ కూలీ కూడా వస్తుంటుంది.



క్రిమి సంహారక మందు పిచికారీ చేస్తున్న మహిళ

నిమ్మసేద్యం.. వనితా సాయం

వెంకటగిరి నియోజకవర్గంలో ఎకరాకు 100 నిమ్మ చెట్లు నాటుతున్నారు. ఇలా 25వేల ఎకరాల్లో సుమారు 2.5 లక్షల నిమ్మచెట్లను సాగుచేస్తున్నారు. మూడేళ్ల దీర్ఘకాలిక పంట అయినా కూడా ఈ ప్రాంత మహిళలు నిమ్మ సాగుపైనే ఆధారపడి జీవిస్తున్నారు. ప్రధానంగా నిమ్మచెట్లు నాటే దగ్గర నుంచి దిగుబడి వచ్చేంత వరకు మహిళలే అన్ని పనులు చేస్తుంటారు. సామూహికంగా నిమ్మకాయలు కోస్తారు. చెట్లకు పాదులు తీసి ఎరువులు వేస్తుంటారు. పురుగు మందులు పిచికారీ చేయాలన్నా ఈ ప్రాంత మహిళలే ముందుంటారు. కాయలు కోసి మార్కెట్‌కు తరలించేంత వరకు అన్నీ తామై వ్యవహరిస్తున్నారు. ఇదేగాక గ్రామాల్లోని మహిళలు కలసికట్టుగా ఉంటూ.. వంతుల వారీగా వ్యవసాయ పనులు చేసుకుంటున్నారు. కేవలం పురుషులు వారికి సూచనలు మాత్రమే అందిస్తున్నారు.

వినూత్న పద్ధతుల్లో సాగుతాం

పొలంలో నిమ్మ మొక్కలు నాటేందుకు 14 మీటర్ల పొడవు, 12 మీటర్ల వెడల్పుతో పాదులు తీస్తారు. ఒక అడుగు లోతు గుంత తీసి అందులో పశువుల ఎరువువేసి మొక్కను నాటుతారు. మొక్క సుమారు ఆరున్నర అడుగులు ఉండేలా చూసుకుంటారు. ముందుగా తోటలో సాగునీటి సమస్య రాకుండా ఉండేందుకు డ్రిప్ సౌకర్యాన్ని ఏర్పాటు చేసుకుంటున్నారు. మామూలుగా అయితే ఎకరాకు 100 నుంచి 120 మొక్కలు నాటుతారు. కానీ ఇక్కడ కొందరు మహిళా రైతులు ఎకరాకు 70 నుంచి 80 మొక్కలు నాటుతున్నారు. నెలకు రెండు సార్లు దుక్కి దున్నకం చేపడుతారు. ఎలాంటి గడ్డీ లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. నిమ్మసాగు సమయంలో రసాయనిక ఎరువులను తగ్గించి పూర్తిగా సేంద్రియ ఎరువులనే వేస్తున్నారు.

పెరిగిన నిమ్మ సాగు విస్తీర్ణం

గడిచిన నాలుగున్నరేళ్లలో పుష్కలంగా వర్షాలు కురుస్తుండడంతో భూగర్భజలాలు పెరిగాయి. సాగునీటి సమస్య లేకుండా పోయింది. దీనికి తోడు మార్కెట్‌లో నిమ్మకు మంచి డిమాండ్ ఉండడంతో స్థానిక రైతులు నిమ్మసాగుపై దృష్టిసారించారు. గతంలో ఐదారు వేల హెక్టార్లలోనే నిమ్మ సాగుచేసేవారు. ఇప్పుడు 10వేల హెక్టార్లపైనే సాగుచేస్తున్నారు. గతంతో పోల్చితే అప్పులన్నీ తీరిపోయాయని పలువురు రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



పాదులు తీస్తూ..



కొమ్మలను కత్తిరిస్తూ..



నిమ్మకాయలు కోస్తూ..



నిమ్మతోటకు నీరు పెడుతూ..

భర్తకు చేదోడువాదోడుగా..



మా గ్రామంలో చాలా మంది నిమ్మ తోటలపైనే ఆధారపడి జీవిస్తున్నారు. మాకు 300 నిమ్మ చెట్లు ఉన్నాయి. ప్రతి రోజూ ఇంటి పనులు ముగించుకుని భర్తతో పాటు నిమ్మతోటకు వెళ్తా. నిమ్మ చెట్లకు నీళ్లు పెట్టి.. గడ్డిలేకుండా తవ్వుతుంటా. తెగుళ్ల లాంటివి వస్తే నేనే మందులు పిచికారీ చేస్తా.

– కొండూరి నాగ రత్నమ్మ, లింగసముద్రం, సైదాపురం మండలం

ప్రభుత్వ సాయం మెండు



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక సాగు నీటికి ఇబ్బందుల్లేకుండా పోయాయి. బోరు బావుల్లో పుష్కలంగా నీళ్లు లభిస్తున్నాయి. మరింతమంది నిమ్మసాగుచేయడానికి ముందుకొస్తున్నారు. ఉద్యానవన శాఖ కూడా రాయితీపై నిమ్మ సాగుకు నిధులు విడుదల చేస్తోంది. నిమ్మ తోటలు కలిగిన రైతులకు రాయితీపై ప్యాక్ హౌస్‌ను కూడా మంజూరు చేశారు. పంటను ప్యాక్‌హౌస్‌లో ఉంచుకుని మరుసటి రోజు ప్యాక్ చేసి మార్కెట్‌కు తరలిస్తాం.

– వై. వెంకటరత్న, లింగసముద్రం

అన్నీ ఆమే!



మా ఇంట్లో వ్యవసాయ పనులన్నీ నా భార్య వెంకటరమణమ్మే చేస్తుంటుంది. మాకు 10 ఎకరాల నిమ్మతోట ఉంది. అందులో 900 నిమ్మ చెట్లు సాగుచేస్తున్నాం. ఏడాదికి ఖర్చులన్నీ పోను రూ.7 లక్షల వరకు ఆదాయం వస్తోంది. 2021లో నేను గ్రామ సర్పంచ్‌గా ఎన్నికయ్యాను. దాంతోపాటు ఓ ప్రైవేట్ కళాశాలలో ఫ్యాకల్టీగా పనిచేస్తున్నా. వ్యవసాయ పనులన్నీ నా భార్యే చూస్తుంటుంది. మా ఇద్దరు పిల్లలను కూడా ఆమే దగ్గరుండి చదివిస్తోంది.

– వెల్లంపల్లి ప్రసాద్‌రాజు, లింగసముద్రం

ఎక్కువ మంది మహిళా రైతులే



వెంకటగిరి నియోజకవర్గంలో అధిక సంఖ్యలో నిమ్మ సాగుచేస్తున్నారు. ఇక్కడందరూ మహిళా రైతులే ఉన్నారు. నిమ్మ తోటల్లో దుక్కి దున్నకం నుంచి రాబడి వచ్చేంత వరకు సాగులో ప్రధాన పాత్ర మహిళలదే. ముందస్తుగా నిమ్మ చెట్లకు ఏయే పురుగు మందు పిచికారీ చేయాలని, ఎలాంటి ఎరువులు వేయాలి, సాగునీరు ఎలా.. ఇలా అనేక విషయాలు వారే ఫోన్ చేసి అడుగుతుంటారు.

– ఆనంద్, ఉద్యానవనశాఖ అధికారి

సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో..

గ్రూప్–1, 2 ఉద్యోగ పరీక్షలపై ఉచిత అవగాహన సదస్సు

- డిసెంబర్ 11వ తేదీన తిరుపతిలో సదస్సు
- గెస్ట్ స్పీకర్‌గా సివిల్స్ విజేత బాలలత
- లక్ష్యం: గ్రామీణ, పట్టణ విద్యార్థులకు గ్రూప్–1,2 పరీక్షలపై అవగాహన కల్పించడం

సాక్షి ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గ్రూప్–1,2 ఉద్యోగాల భర్తీకి త్వరలోనే ఏపీపీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో..గ్రామీణ, పట్టణ విద్యార్థులను గ్రూప్–1,2 స్థాయి ఉద్యోగులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో.. సాక్షిఎడ్యుకేషన్.కామ్ (www. sakshieducation. com) ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా ఉచిత అవగాహన సదస్సులను నిర్వహించనుంది. గత కొన్ని సంవత్సరాలుగా వివిధ పోటీ పరీక్షలకు ప్రిపేరయ్యే అభ్యర్థులకు సాక్షిఎడ్యుకేషన్.కామ్ తోడుగా ఉంటున్న విషయం మీ అందరికి తెల్సిందే.

గెస్ట్ స్పీకర్‌గా బాలలత :
ఎంతో మందిని పోటీ పరీక్షల్లో విజేతలుగా తీర్చిదిద్దుతున్న సివిల్స్ టాపర్ బాలలత గ్రూప్1, గ్రూప్ 2 ఉద్యోగ పరీక్షలపై ఉచిత అవగాహన సదస్సుకు గెస్ట్ స్పీకర్‌గా హాజరుకానున్నారు. ఆమె గ్రూప్1, 2 పరీక్షలపై అవగాహన కల్పించడం తోపాటు విద్యార్థుల సందేహాలను నివృత్తి చేయనున్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు 8977625795 ఫోన్ నెంబర్‌కు తమ పేరు, ఫోన్ నెంబర్, జిల్లా వివరాలను వాట్సాప్‌లో పంపగలరు.

ముఖ్య సమాచారం

అవగాహన సదస్సు తేదీ
డిసెంబర్ 11, 2023 (సోమవారం)

వేదిక
మహతి ఆడిటోరియం, బాలాజీ కాలనీ, టౌన్ క్లబ్ సమీపాన, తిరుపతి

సమయం
ఉదయం 09:30 నుంచి 12:30 వరకు.

వివరాలకు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్ : 89776 25795

సంక్షేమం.. సుభిక్షం



లబ్ధిదారుకు సంక్షేమ బుక్‌లెట్ అందిస్తున్న మంత్రి రోజా

పుత్తూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలనతో రాష్ట్రం సుభిక్షంగా ఉందని మంత్రి ఆర్‌కే రోజా తెలిపారు. శుక్రవారం రాత్రి మండలంలోని కృష్ణసముద్రంలో ఆమె పల్లెనిద్ర నిర్వహించారు. అనంతరం శనివారం రామసముద్రం గ్రామంలో చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వంలో పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. సంక్షేమ బావుటా బుక్‌లెట్ అందజేశారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుని వెంటనే పరిష్కరించేందుక చర్యలు చేపట్టారు. మంత్రి మాట్లాడుతూ నాలుగున్నరేళ్లలో జగనన్న అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ వైఎస్సార్‌సీపీనే గెలిపించుకోవాలని కోరారు. జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పిలుపునిచ్చారు. గతంలో ఎవరూ ఇలా ప్రతి ఇంటికీ వచ్చి సంక్షేమ పథకాలు అందాయా? మీ అవసరాలు ఏంటి అని అడిగిన దాఖలాలు లేవన్నారు. ఈరోజు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన మేలును ధైర్యంగా వివరించేందుకు ప్రతి గుమ్మం వద్దకు వస్తున్నామని తెలిపారు. తహసీల్దార్ జె.పరమేశ్వరస్వామి, ఎంపీపీ మునివేలు, మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్‌యాదవ్, సర్పంచ్ కుమార్‌స్వామి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఏలుమల్లై, రవి, పురుషోత్తం, యువరాజ్, గాంధీ, శ్యామ్, ప్రభు, రాజా, రవి యాదవ్, రమేష్ పాల్గొన్నారు.

వరసిద్ధుని సేవలో ప్రముఖులు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామిని శనివారం పలువురు ప్రముఖులు సేవించుకున్నారు. వేర్వేరుగా ఆలయం వద్దకు విచ్చేసిన రాష్ట్ర సచివాలయ జీఏడీ సెక్రటరీ పోలా భాస్కర్, నెల్లూరు డీఆర్‌ఓ లవన్న, సినీ దర్శకుడు శ్రీకాంత్ ఓదెలకు ఈఓ వెంకటేశు, ఇన్‌స్పెక్టర్ రమేష్ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చారు. ఆలయాధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు, చిత్రపటం అందించారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ కోదండపాణి పాల్గొన్నారు.

28న కులగణన ప్రాంతీయ సదస్సు

చిత్తూరు కలెక్టరేట్ : తిరుపతి శ్రీపద్మావతి మహిళా యూనివర్సిటీలో ఈ నెల 28వ తేదీన కులగణన ప్రాంతీయ సదస్సు నిర్వహించనున్నట్లు జిల్లా బీసీ సంక్షేమశాఖ డీడీ రబ్బానీబాషా శనివారం తెలిపారు.

డేటా ఎంట్రీ ఆపరేటర్ శిక్షణకు దరఖాస్తులు

చిత్తూరు కలెక్టరేట్ : స్కిల్ హబ్‌లో డేటా ఎంట్రీ డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ శిక్షణకు అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని ఐటీఐ ప్రిన్సిపల్ రవీంద్రరెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఉచితంగా శిక్షణ అందిస్తున్నట్లు వెల్లడించారు. డిసెంబర్ 3వ లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. వివరాలకు 8500384812, 8919373147 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

క్రీడాకారులకు అండగా ప్రభుత్వం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

చౌడేపల్లె : క్రీడాకారులకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని, పూర్తిస్థాయిలో ప్రోత్సాహం అందిస్తోందని తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి తెలిపారు. శనివారం చౌడేపల్లె ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహిస్తున్న అండర్-17 అంతర్‌జిల్లాల బాలబాలికల కబడ్డీ పోటీలకు ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడారంగం అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేకంగా నిధులు మంజూరు చేశారన్నారు. గ్రామీణ క్రీడాకారుల్లోని నైపుణ్యాలను వెలికితీసేందుకు ఆడుదాం ఆంధ్ర,తోపాటు జోనల్, మండల స్థాయిలో పోటీలు నిర్వహిస్తున్నారని వెల్లడించారు. ఈ క్రమంలోనే నాడు-నేడు కింద ప్రభుత్వ పాఠశాలల్లోని మైదానాలను అభివృద్ధి చేశారని చెప్పారు. పుంగనూరు నియోజకవర్గంలో రాష్ట్రస్థాయి క్రీడల నిర్వహణకు కృషిచేసిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, పాఠశాల పూర్వపు విద్యార్థులకు అభినందనలు తెలిపారు. క్రీడాకారులు గెలుపోటములను సమానంగా తీసుకోవాలని సూచించారు. కబడ్డీ పోటీలను ఆద్యంతం ఆసక్తిగా తిలకించిన అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా విచ్చేసిన మొత్తం 700 మంది క్రీడాకారులకు ఆదివారం విందు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాజంపేట, చిత్తూరు పార్లమెంట్ యూత్ అధ్యక్షుడు మిద్దింటి కిషోర్‌బాబు, కబడ్డీ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర, సర్పంచ్ వరుణ్‌భరత్,, ఎంపీపీ రామమూర్తి, వైస్ ఎంపీపీ సుధాకర్‌రెడ్డి, స్కూల్ గేమ్స్ మాజీ కార్యదర్శి మల్‌రెడ్డి, జిల్లా కబడ్డీ సంఘ అధ్యక్షుడు మధుబాబు, జాతీయ క్రీడాకారుడు చినబాబు, క్రీడల అబ్జర్వర్ రాంబాబు, పూర్వపు విద్యార్థులు పిల్లారి జీవన్ ప్రకాష్, లీలాకుమార్, మహేష్ బాబు, హనుమాన్‌సేట్, మంజునాథ్, పాల్గొన్నారు.

'వికసిత్ భారత్'కు శ్రీకారం



జెండా ఊపి వాహనాలను ప్రారంభిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : కేంద్రప్రభుత్వ పథకాల ప్రచారమే లక్ష్యంగా 60 రోజుల పాటు వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కొనసాగనున్నట్లు కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. శనివారం చిత్తూరులోని గాంధీసర్కిల్ వద్ద ప్రచార వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించేందుకే వికసిత్ యాత్రకు శ్రీకారం చుట్టినట్లు వెల్లడించారు. జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ యాత్రను పకడ్బందీగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. డీఈఓ విజయేంద్రరావు, సమగ్రశిక్ష ఏపీసీ పెద్దిరెడ్డి వెంకటరమణారెడ్డి, సోషల్ వెల్ఫేర్ డీడీ రాజ్యలక్ష్మి, డీపీఓ లక్ష్మి, డీఎంహెచ్‌ఓ ప్రభావతి, డీఎస్‌ఓ శంకరన్, డీవీఈఓ సయ్యద్ మౌలా పాల్గొన్నారు.

పకడ్బందీగా 'యాత్ర'

వికసిత్ భారత్ సంకల్ప యాత్రను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. శనివారం పలు శాఖల అధికారులతో, ఎంపీడీఓలతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా నిర్దేశించిన షెడ్యూల్ మేరకు విజయవంతంగా యాత్ర చేపట్టాలని సూచించారు. కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న ఆయుష్మాన్‌భారత్, పీఎం గరీబ్ కల్యాణ్ యోజన, ఇలా 17 సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని తెలిపారు. ఈ పథకాలకు అర్హులుంటే ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసి పేర్లు నమోదు చేయించాలన్నారు. ఆయా పథకాలతో అభివృద్ధి చెందిన వారిని సత్కరించాలని స్పష్టం చేశారు. ఈ మేరకు విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించాలన్నారు. అనంతరం ఫొటోలు, వీడియోలను సంబంధిత యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. సమావేశంలో జేసీ శ్రీనివాసులు, డీఆర్‌ఓ రాజశేఖర్, జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

స్కిల్ కాలేజీల్లో ప్రవేశానికి దరఖాస్తులు

చిత్తూరు అగ్రికల్చర్: జిల్లాలోని స్కిల్ కాలేజీల్లో ప్రవేశానికు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు డీఆర్‌డీఏ పీడీ తులసి తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ చిత్తూరు టీటీడీసీ ఆవరణలోని స్కిల్ కాలేజీలో రిటైల్ సేల్స్ సూపర్‌వైజర్ కోర్సు అడ్మిషన్‌కు డిగ్రీ , ఇంటర్ పూర్తి చేసి రెండేళ్ల అనుభవం కలిగి , 20 నుంచి 28 ఏళ్ల గ్రామీణ యువత అర్హులన్నారు. శిక్షణ అనంతరం అభ్యర్థులకు ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగావకాశం కల్పించనున్నట్లు వెల్లడించారు. అడ్మిషన్ పొందిన వారికి కోర్సు స్టడీ మెటీరియల్, యూనిఫామ్‌తోపాటు ఉచిత భోజన, వసతి సౌకర్యం ఉంటుందని తెలిపారు. వివరాలకు 9581041026, 9390504650, 9052182074 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

అకృత్యాల అడ్డుకట్టకు కృషి



మాట్లాడుతున్న న్యాయమూర్తి కరుణకుమార్

చిత్తూరు అగ్రికల్చర్: సమాజంలో అకృత్యాల అడ్డుకట్టకు స్వయం సహాయక సంఘాల మహిళలు కృషి చేయాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కరుణకుమార్ పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని జిల్లా సమాఖ్య సమావేశ భవనంలో డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. న్యాయమూర్తి మాట్లాడుతూ సమాజాన్ని చైతన్యవంతం చేయడంలో స్వయం సహాయక సంఘాల సభ్యులు కీలకపాత్ర పోషించాలని కోరారు. దేశవ్యాప్తంగా సంఘాల ఏర్పాటుతో అనేక సామాజిక రుగ్మతలు నిర్మూలించబడ్డాయని తెలిపారు. కుటుంబ వ్యవస్థ కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. స్త్రీ లేనిదే విశ్వమే లేదన్న సత్యాన్ని అందరూ గుర్తించాలని సూచించారు. కూతురు, కొడుకు విషయంలో వివక్ష చూపకూడదని స్పష్టం చేశారు. అనంతరం జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా మానవహారం నిర్వహించారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ తులసి, డీపీఎంలు వెంకటేశ్, రవి పాల్గొన్నారు.

బంగారు ఆభరణాల చోరీ

చిత్తూరు అర్బన్: నగరంలోని ఆర్టీసీ బస్టాండులో గుర్తుతెలియని వ్యక్తులు ఓ మహిళ నుంచి 80 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీ చేశారు. దీనిపై శనివారం చిత్తూరు వన్‌టౌన్ ఎస్‌ఐ భారతి కేసు నమోదు చేశారు. జీడీ నెల్లూరు మండలం ఎల్లమరాజులపల్లెకు చెందిన భారతి అనే వివాహిత బెంగళూరులో ఉంటూ ఇటీవల స్వగ్రామానికి వచ్చారు. శుక్రవారం రాత్రి బెంగళూరు బయలుదేరడానికి బంగారు ఆభరణాలను సంచిలో పెట్టుకుని బస్టాండుకు వచ్చారు. ఇక్కడ బస్సు ఎక్కిన తర్వాత చూస్తే సంచి కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుత్ చౌర్యంపై జరిమానా

చిత్తూరు కలెక్టరేట్ : చిత్తూరు అర్బన్, రూరల్, గుడిపాల మండలాల్లో డిస్కం డీపీఈ శ్రీనివాసబాబు బృందం తనిఖీలు నిర్వహించి విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న వినియోగదారులకు జరిమానా విధించారు. తనిఖీల్లో మొత్తం 79 మంది అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్నట్లు గుర్తించారు. రూ.6.22 లక్షల జరిమానా విధించారు. అనంతరం కట్టమంచి సబ్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. విజిలెన్స్ డీఈఈలు రామ్మోహన్, బాలాజీ పాల్గొన్నారు.

రేపటి స్పందన రద్దు

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజా సమస్యల పరిష్కారం కోసం సోమవారం నిర్వహించే స్పందనను రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ షణ్మోహన్ శనివారం తెలిపారు.

లాటరీ పేరిట మోసం



నగదు వసూలు చేసిన వ్యక్తి

చౌడేపల్లె : మండలంలోని పలు ప్రాంతాల్లో ప్రజలను గుర్తుతెలియని వ్యక్తులు లాటరీ పేరిట మోసం చేసిన విషయం శనివారం వెలుగులోకి వచ్చింది. వివరాలు.. చౌడేపల్లె కేటీ స్ట్రీట్, బత్తలాపురం రోడ్డులో నివసిస్తున్న రమేష్ భార్య లక్ష్మీదేవికి రూ.10లకే మూడు అగరబత్తుల ప్యాకెట్లను ఇద్దరు వ్యక్తులు విక్రయించారు. సదరు ప్యాకెట్లలో లాటరీ కూపన్లు ఉంటాయని, అది వస్తే రూ.7వేల విలువైన నాన్‌స్టిక్ వంట సామగ్రి, మిక్సీని రూ.3,500లకే అందిస్తామని నమ్మబలికారు. అగరబత్తుల ప్యాకెట్ ఓపెన్ చేయగానే లక్ష్మీదేవికి లాటరీ తగిలిందని చెప్పారు. మాయమాటలను విశ్వసించిన ఆమె వెంటనే నగదు చెల్లించి వస్తువులు తీసుకుంది. శ్రీవినాయక హోమ్ నీడ్స్ పేరిట రశీదు సైతం అందించారు. తీరా బాక్స్ తీసి చూడగా అందులో ఎందుకూ పనికిరాని వస్తువులు ఉన్నాయి. ఈ వస్తువులు ఇచ్చే సమయంలోనే మరో ప్యాకెటుకు సైతం లాటరీ తగిలిందని, రూ.లక్ష విలువైన ఎల్‌ఈడీ టీవీని రూ.7వేలు చెల్లిస్తే ఇస్తామని నగదు తీసుకున్నారని బాధితురాలు వాపోయింది. ఈ మేరకు పోలీసులను ఆశ్రయించింది. మాయగాళ్లు తమది సోమల మండలం అని చెప్పారని, ఫోన్‌పేలో తాను జయచిత్ర అనే మహిళ ఖాతాకు 7416119573 నంబర్ ద్వారా నగదు చెల్లించినట్లు ఫిర్యాదులో పేర్కొంది. ఈ క్రమంలోనే మండలంలోని పలువురి నుంచి గుర్తుతెలియని వ్యక్తులు నగదు వసూలు చేసి ఉడాయించినట్లు తెలిసింది. దీనిపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఇంటి తలుపులు పగలగొట్టి చోరీ

పాలసముద్రం : మండలంలోని బలిజకండ్రిగలో తులసమ్మ అనే మహిళ ఇంటి తలుపులు పగులగొట్టి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన ఘటన శనివారం వెలుగుచూసింది. వివరాలు.. తులసమ్మను ఆమె కుమారుడు జగదీష్ వైద్యం కోసం శుక్రవారం రాత్రి సీఎంసీకి తీసుకెళ్లాడు. ఈ విషయం గమనించిన దుండగులు ఇంట్లో చొరబడి 25 గ్రాముల బంగారం, రూ.40 వేలు, రెండు ల్యాప్‌టాప్‌లు, బైక్ అపహరించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

వారం రోజుల్లోనే కేసు పరిష్కారం

- న్యాయమూర్తి చొరవతో ఒక్కటైన కుటుంబం



సమస్య పరిష్కరించుకున్న కుటుంబీకులతో న్యాయమూర్తి శ్రీనివాసరావు తదితరులు

పలమనేరు: సాధారణంగా క్రిమినల్ కేసుల పరిష్కారానికి ఏళ్ల తరబడి వేచిచూడాల్సిందే. కానీ పలమనేరు సీనియర్ సివిల్ జడ్జి చొరవతో ఓ క్రిమినల్ కేసు కోర్టుకొచ్చిన వారానికే పరిష్కారమైంది. ఈ సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. బైరెడ్డిపల్లి మండలం కుమ్మరకుంటకు చెందిన గంగరాజులు, భాగ్యమ్మ భార్యాభర్తలు. వీరికి ఇద్దరు ఆడపిల్లలున్నారు. భార్యాభర్తల మధ్య మనస్పర్థలు తలెత్తడంతో భర్త గంగరాజులు పిల్లలతో కలసి ఆత్మహత్య చేసుకోవాలని భావించాడు. దీంతో పాలకోవాలో ఎలుకలమందును కలిపి తనతోపాటు పిల్లలకు తినిపించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. భార్యాభర్తల గొడవతో సొంత పిల్లల్ని సైతం చంపాలని చూసిన కుమారుడిపై తండ్రి నాగప్ప బైరెడ్డిపల్లె పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ కేసు స్థానిక కోర్టులో ఈ నెల 17వ తేదీన ఎస్‌సీ 351/23గా నంబరైంది. ఈ కేసును పరిశీలించిన న్యాయమూర్తి పగడాల శ్రీనివాసరావు ముద్దాయి గంగరాజులు, అతని భార్యపిల్లలు, ఫిర్యాదీ నాగప్ప కుటుంబసభ్యులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చి మార్పు తీసుకొచ్చారు. కేసులతో కలిగే ఇబ్బందులను వివరించి రాజీ కుదిర్చారు. తమ కుటుంబాన్ని కలిపినందుకు వారు జడ్జికి కృతజ్ఞతలు తెలిపారు. ఏపీపీ రంజిత్‌షా, న్యాయవాది రంజిత్‌కుమార్, లైజనింగ్ ఆఫీసర్ రమేష్, కానిస్టేబుల్ సునీల్ పాల్గొన్నారు.